మాయమ్మకి గూడ చెడ్డ గడియన చావొచ్చెనని.. ఎన్నో శాంతి పూజలు చేయించాల్సి వచ్చె! కనీసం అక్షరం ముక్కరాని ఈ అమ్మాజీ ఏ దినాన గూడ ఏ దేవుడికి మొక్కుడు చూడలే.. అయిన సరె అప్పనంగ స్వర్గానికి పోయేటట్టుంది''..

పద్మ గొంతులో అసూయ లాంటిది తొణికిసలాడింది. ఎందుకో తెలియదు ఇప్పటికిప్పుడు అమ్మాజీ చచ్చిపోయి తననేదో మోసం చేసేసి, తనకు డబ్బు నష్టం కలిగించినట్టు ఫీలింగ్ వచ్చి.. అమ్మాజీపై అకారణంగా చిన్నపాటి ద్వేషంకూడా పుట్టుకొచ్చేసింది ఆమె మనసులో.

చీల మండలపైకి చీరకట్టుతో, సీవెండి గాజులు, ఎర్ర పూసల దండ వేసుకుని పలచబడిపోయిన జుట్టుతో జిల్లేడు మొగ్గంత ముడి వేసుకుని మోటు మనిషిలా, అమాయకత్వంతో కూడిన మాటలతోనూ ఉండే అమ్మాజీ అంటే.. పద్మకు మొదటినుండి చిన్నచూపే! ఎవరే పని చెప్పినా, ఏం వండి పెట్టమన్నా విసుగన్నది చూపించకుండా అన్నీ అమర్చిపెడుతూ కూడా జీతం పెంచమని కానీ, మానేస్తానని కానీ అనని అమ్మాజీనీ..

'ఎక్కడికి పోతుందిలే' అన్న అలసత్వంతో మరీలోకువగా కూడా చూసేది. అలాంటిదీ రోజు అమ్మాజీ పుణ్యాతిథిన పోయి స్వర్గానికి వెళ్లేవారి లిస్టులోకి చేరిందంటే.. పద్మ మనసు అస్సలు తట్టుకోలేక పోతున్నది.

'ఆమె ఏం పుణ్యకార్యాలు, ఘనకార్యాలు జేసెనని ఆ దేవుడీ సన్మానం చేసిండు' అని అర్థంకాక తెగ మధన పడిపోతున్నది.

* * *

రెండు రోజులు వరుసగా హోటల్ భోజనాలతో గడిపాక మామగారికి, భర్తకు, ఆఖరికి తనకు కూడా ఎసిడిటీతో కడుపులో మంట మొదలయ్యే సరికి.. ఆరువేలు ఇస్తామని చెప్పి ఓ వంటమనిషిని పెట్టుకున్నారు. రుచికరంగా వండించుకుని తింటూ అమ్మాజీ పేరుకూడా తలుచుకోవటం మానేశారంతా.. వాళ్ల దృష్టిలో అమ్మాజీ ఓ గతం.

కానీ, అమ్మాజీ కనిపించని రోజు నుండి ముద్దముట్టని స్నూపీ.. చిక్కి శల్యంగా మారసాగింది. దానికెందుకు తిండి సహించటం లేదో అర్థం కాని ఇంట్లో వాళ్లు..

'ఒకవేళ మాంసం ముక్కల మీద మొహం వాచిందేమో' అనుకొని కోడి కాళ్లు, మేక బసర కొని తెప్పించి వండించి పెట్టారు.

మాంసాహారం అంటే తోక ఊపుకొంట ఎగబడిపోయే స్నూపీ.. ఆ కంచం వైపు మొఖం తిప్పి వాసన కూడా చూడలేదు. దాని నిరాహార దీక్ష ఏడో రోజుకు చేరింది.

దాని కనుకొనలకు పుసుకులు కట్టి నీరుధారగా అట్టకట్టింది. డాక్టర్ కూడా వచ్చిచూసి.. ఇంజక్షన్ ఇవ్వాలన్నా వీలు పడనివ్వలేదు. అతణ్నే కాదు ఎవ్వర్నీ దగ్గరికి రానీయడం లేదు. ఎవరైనా దగ్గరికి రాబోతుంటే 'గుర్రు గుర్రు' మంటూ ముడుచుకుని పడుకుని, అప్పుడప్పుడూ ఓపిక తెచ్చుకుని నెమ్మదిగా పైకిలేచి వంటగది గుమ్మం వైపు చూడటం మాత్రం మానలేదు.

దాన్ని పదివేలు పెట్టి కొనితెచ్చింది భాస్కరమే అయినా.. దాని ఆలన పాలన చూసింది మాత్రం అమ్మాజీయే! కాబట్టి, అమ్మాజీ మీద కాస్త బెంగ పెట్టుకుందేమోనని అందరికీ అర్థమై.. కొన్నాళ్లకు మరిచిపోతుందిలే! అనుకున్నారు.

తొమ్మిదో రోజు ఓ అపరిచిత వ్యక్తి గేటు దగ్గరున్న కాలింగ్ బెల్ నొక్కి, గేటు తీసుకుని లోనికి వస్తుంటే.. అక్కడే గేటు పక్కన కట్టేసి ఉన్న స్నూపీ ఓపిక తెచ్చుకుని లేచి ఆ వ్యక్తి దగ్గరగా వచ్చి 'కుయ్ కుయ్!' అంటూ తన రెండు కాళ్లనూ పైకిచాపి, ఆ వ్యక్తి గుండెలపై వేసి ముఖం నాకి, మళ్లీ కిందకి వచ్చి అతని చేతిలో కనిపిస్తున్న తినుబండారాలను నోటితో లాక్కుని, అక్కడే అతణ్ని ఎటూ కదలనీయకుండా అతని పాదాల మీద జారబడి కూర్చుని ఆబగా తినసాగింది. ఆ వ్యక్తి ఈ హఠాత్పరిణామానికి కాస్త బెదిరినా ధైర్యంగా నిలదొక్కుకుని, అక్కడే ఉయ్యాల బల్ల మీద కూర్చుని సెల్‌ఫోన్లో సోషల్ మీడియా వీడియోలు చూస్తూ బిజీగా ఉన్న పద్మ వైపూ, కుర్చీలో కూర్చుని పేపర్ చదువుతున్న బలరామ్మూర్తి గారి వైపూ చూస్తూ...

''ఏమండీ..'' అని పిలిచాడు.

'ఎవరు నువ్వు?' అన్నట్టు చూశారు వాళ్లు.

''నాపేరు రామచంద్రం. నేను కంటి హాస్పిటల్ నుండి నేరుగా ఇక్కడికి వచ్చాను. నాకు కంటిచూపు పోతే.. హాస్పిటల్లో ట్రీట్మెంటు తీసుకుంటున్నా.. ఎవరో ఒక డాక్టర్ ఉపన్యాసం విని, మీ ఇంట్లో ఉన్న ఓ దేవత తను బతికుండగా తన కళ్లను దానం చేసి, కళ్లు లేని వాళ్లకు ఉచితంగా పెట్టమని అప్లికేషన్ పెట్టి, ఎవరి అనుమతీ అవసరం లేదని, తను చనిపోగానే తీసుకుపొమ్మని రాయించి వేలి ముద్రేసి, అప్లికేషన్లో ఇదే తన అడ్రస్ అని రాయించిందట. ఆమెకు ఊపిరాడక ఇబ్బంది పడుతుంటే పక్కింటి వాళ్లు అంబులెన్స్‌కి ఫోన్ చేశారట. వాళ్లు వచ్చేసరికే చని పోయిందట. ఆమె కంటి పొర నా కంటికి అమర్చి.. నాకు చూపు వచ్చేలా చేశారు. అందుకే ఆమె ఇంట్లో వాళ్లకు కృతజ్ఞతలు చెప్పుకొందామని చూపు వచ్చిన మరుక్షణం ఇక్కడికే వచ్చేశాను. తన కళ్లే కాదు.. తన విగత శరీరాన్ని నిరుపయోగంగా కాల్చేయవద్దనీ, దానిలో ఎవరికైనా అవసరమైతే ఏ అవయవాన్నయినా తీసుకోమని, లేకుంటే మెడికల్ స్టూడెంట్ల కోసం హాస్పిటల్‌కి ఇచ్చేయమందట ఆ దేవత. అంతేకాదు తన పేరున పోస్టాఫీసులో కొంత డబ్బు ఉందనీ, తనుపోతే అది తీసి ఓల్డేజ్ హోమ్‌కి ఇమ్మని బతికుండగానే పేపర్ మీద రాయించి వేలిముద్ర వేసిందట.

అంతటి పుణ్యాత్మురాలు నివసించిన చోటు చూసి తరించాలని వచ్చాను. ఆమెతో నివసించిన ఈ ఇంటి వారు కూడా ఎంతో గొప్పవారు అనిపిస్తున్నది.

ఇన్నాళ్లూ మీ ఇంట్లో వెలిగిన వెలుగు నా కంటి వెలుగై నాకు జీవితాన్నిచ్చి బతకాలనే ఆశ పుట్టించింది. ఆమె కంటితో నేను లోకాన్ని చూసేలా చేసింది. మీరేకాదు మీలాగే మీ కుక్కకూడా మనసున్న దానిలా ఉంది. ఇది నా మీదకి ఎక్కేసరికి భయపడ్డాను. విచిత్రంగా నా ముఖాన్ని ముద్దాడి నేను మీకివ్వాలని తెచ్చిన స్వీట్స్ తీసుకుని తినటమేంటో.. అర్థం కాలేదు. సాధారణంగా ఈ జర్మన్ షపర్డ్ జాతి కుక్కలు కొత్తవారిని కరవకుండా వదలవు. ఇప్పుడు కూడా ఇది నా పాదాల మీద కూర్చుని నా కాలు కదపనీయటం లేదెందుకో..'' అన్నాడు ఆ వచ్చినతను.

అతను చెప్పింది విన్నాక అర్థమైంది పద్మకు. అమాయకంగా కనిపించే అమ్మాజీ ఎంత గొప్ప పనిచేసిందో! తన శరీరంలో తొడ భాగాన్ని తృణ ప్రాయంగా కోసి దానంగా ఇచ్చేసిన శిబి చక్రవర్తి కంటే కూడా తన యావత్ శరీరాన్ని దానం చేసిన అమ్మాజీ గొప్పగా కనిపించింది. తను అమ్మాజీ రూపమే చూసింది. కానీ, ఆమెలో మంచితనం చూడలేక పోయింది. స్నూపీ మాత్రం అమ్మాజీ రోజూ దానికి అన్నం పెట్టేటప్పుడు ఆమె కళ్లలో ఆప్యాయత చూసి ఆమెపై ప్రేమ పెంచుకుందనుకుంటా.. ఆ కంటి ఆనవాళ్లు మళ్లీ చూసేసరికి దాని బెంగపోయింది. తినాలని ఆశ పుట్టింది.

ఛఛ.. ఏమిటి తన బుద్ధి. రెండేళ్ల పరిచయానికే తనకు అన్నం పెట్టే అమ్మాజీని అభిమానించి తను చనిపోతే తిండి మానేసి బెంగపడిన కుక్కకున్న విశ్వాసం, పదేళ్లుగా అమ్మలా ఆప్యాయంగా వండి వడ్డిస్తున్న అమ్మాజీని, మనిషి పుట్టుక పుట్టిన తనెందుకు అభిమానించలేక పోయిందో తలుచుకుంటుంటే సిగ్గుగా అనిపించి.. తల వంచుకున్న పద్మకు తనకెప్పుడూ నేలకు అట్టడుగున కనిపించే అమ్మాజీ ఒక్కసారిగా 'ఇంతింతై వటుడింతయై' అన్నట్లు వామన అవతారంలో విష్ణుమూర్తిలా పెరిగిపోతుంటే.. తలఎత్తి చూడగా ఆకాశమంతా అనంతంగా అమ్మాజీయే కనిపించేసరికి.. తలతిప్పి మామగారి వైపు చూసింది. అప్పటికే వచ్చిన మనిషివైపూ స్నూపీ వైపూ మార్చిమార్చి చూస్తున్న బలరామ్మూర్తి గారు, తనను స్నూపీతో పోల్చుకోగా.. ఆయన మనసు భారమయింది. పదేళ్లుగా ఇంటి మనిషిలా.. మనిషిమనిషికీ నచ్చినట్టు వండి వడ్డించిన అమ్మాజీ చనిపోతే కనీసం ఒక్కపూట పస్తుండి సంతాపం చూపించకపోగా.. తిండి కోసం వెంపర్లాడానన్న అపరాధ భావం మనసంతా నిండిపోగా, వచ్చిన మనిషిని లోనికి తీసుకెళ్లి, మర్యాదచేసి ఆ వ్యక్తి కళ్లలో అమ్మాజీని చూస్తూ.. అప్పుడప్పుడూ వస్తుండమని చెప్పి పంపించారు.

పూజలు, పునస్కారాలు, పురాణాలు, పుణ్యక్షేత్రాలు కాదు.. మనిషిని దేవుడి సరసన నిలబెట్టేవి.

మనిషి మరణించినా మరో మనిషికి బతుకునిచ్చే గుప్తదానం, అవయవ దానమే దేవుడికి దగ్గరయ్యేలా చేసి మనిషిని దేవతగా నిలబెడుతుందని, మరణించినా మళ్లీ మనుషుల మధ్య చిరంజీవిగా ఉంచగలదని, అమ్మాజీ గురించి పూర్తిగా అర్థమైన పద్మ.. ఆరోజే తను కూడా ఓ మంచి నిర్ణయం తీసుకుంది. ■

## సౌందర్య తేజ కోరా



రాసిన రెండు కథలకూ నమస్తే తెలంగాణ – ముల్కనూర్ ప్రజాగ్రంథాలయం కథల పోటీల్లో బహుమతులు గెలుచుకున్నారు యువ రచయిత్రి సౌందర్య తేజ కోరా. కథల పోటీ – 2022లో 'మట్టి వాసన', 2023/24లో 'చిరంజీవి' రెండు కథలూ రూ. 3వేల బహుమతికి ఎంపికయ్యాయి. రచయిత్రి స్వస్థలం భద్రాచలం. తల్లిదండ్రులు దుద్దుంపూడి అనసూయ – చంద్ర శేఖర్. బాల్యం, విద్యాభ్యాసం రాజమండ్రిలో గడిచింది. బెంగళూరులో ఎంబీఏ చదివి, ప్రస్తుతం అక్కడే ఉద్యోగం చేస్తున్నారు. అమ్మ దుద్దుంపూడి అనసూయ, పెద్దమ్మ జాస్తి రమాదేవి ఇద్దరూ రచయిత్రులే! దాంతో బాల్యం నుంచీ కథలు చదవడం, రాయడంపై ఇష్టం పెంచుకున్నారు. వారి ప్రోత్సాహంతోనే కథా రచనలోకి అడుగుపెట్టారు. అయితే, ఉద్యోగబాధ్యతల వల్ల కథలు రాయడానికి సమయం కేటాయించలేక పోతున్నారు. తన చిన్నతనంలో తాతగారి ఒళ్లో కూర్చొని విన్న ఆయన వ్యవసాయ అనుభవాలనే.. 2022లో 'మట్టి వాసన'గా పాఠకుల ముందుకు తీసుకొచ్చారు. తాజాగా, కొన్ని వాస్తల సంఘటల స్ఫూర్తితో 'చిరంజీవి' కథను మలిచారు. తన కథలను బహుమతికి ఎంపిక చేసిన నమస్తే తెలంగాణ – ముల్కనూరు సాహితీ పీఠానికి కృతజ్ఞతలు చెబుతున్నారు.